క్లుప్తంగా

భూమనకు అభినందన



భూమనను సత్కరిస్తున్న విజయానందరెడ్డి

తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన భూమన కరుణాకర రెడ్డికి పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త ఎంసీ విజయానందరెడ్డి అభినందనలు తెలిపారు. సోమవారం ఈ మేరకు పద్మావతిపురంలోని నివాసంలో భూమనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత గాయత్రీదేవి పాల్గొన్నారు.

గ్రంథాలయ సదస్సు బ్రోచర్ విడుదల

తిరుపతి సిటీ : ఎస్వీయూ గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో డిసెంబర్ 7వ తేదీ నుంచి రెండు రోజుల పాటు సాంకేతి విద్య- మాధ్యమాల పాత్ర అనే అంశంపై నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ప్రొఫెసర్ సురేంద్రబాబు, ఏపీ గ్రంథాలయ సంఘం కార్యదర్శి రావి శారద పాల్గొన్నారు.

వేతనం పెంచాలని డిమాండ్

పాకాల : ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనం పెంచాలని, కనీసం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు మధుసూదన్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు ఎంఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. మధుసూదన్‌రావు మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పెండింగ్ జీతాలు వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు ప్రసాద్, సుగుణమ్మ, ధనమ్మ, రెడ్డెన్న, కార్మికులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఆరుగురికి జైలు

తిరుపతి లీగల్ : అధిక మోతాదులో మద్యం తాగి వాహనాలు నడిపిన ఆరుగురికి జైలు శిక్ష, రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. ఇందులో ఆటో డ్రైవర్లు సి.చంగల్రాయులు, పి.మునిగోపాల్‌కు 3 రోజుల జైలు, ద్విచక్రవాహనాలు నడిపిన ఏ.గురవయ్య, కె.సిద్ధయ్య, టి. కన్నయ్య, ఎస్.గిరిబాబుకు 2 రోజుల జైలుశిక్ష పడింది. మరో 30 మందికి రూ.10వేల చొప్పున జరిమానా విధించారు.

గంగమ్మ హుండీ లెక్కింపు

తిరుపతి కల్చరల్ : శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయం హుండీ లెక్కింపును సోమవారం నిర్వహించారు. 108 రోజులకుగాను హుండీ ద్వారా రూ.31,80,138 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ జయకుమార్ తెలిపారు. దేవదయ శాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్ పి.ఫణిరాజశయన పర్యవేక్షణలో కానుకలను లెక్కించినట్లు వెల్లడించారు.

కబ్జాకోరు నుంచి కాపాడాలని వినతి

తిరుపతి కల్చరల్ : తమ భూమిని కబ్జా చేసి, అడిగితే దౌర్జన్యం చేస్తున్న వ్యక్తి నుంచి కాపాడాలని ఏకాంబర కుప్పానికి చెందిన ఎస్పీ జీవనందన్ విన్నవించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. తిరుచానూరు గ్రామ లెక్క దాఖలా సర్వే నంబర్ 255/1బీ1లో 72 సెంట్ల భూమి ఏళ్ల తరబడి తమ స్వాధీనంలో ఉందని తెలిపారు. ఈ మేరకు తన తండ్రి ఎస్‌జీ పాండు రంగన్ పేరున పట్టా కూడా ఉందన్నారు. అయితే తమ స్థలంలోని 21 సెంట్లను విశ్రాంత పోలీసు అధికారి భాస్కర్ నాయుడు తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించారని ఆరోపించారు. ప్రశ్నిస్తే తమపై దౌర్జన్యానికి పాల్పడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై హైకోర్టును ఆశ్రయిస్తే స్టేటస్ కో ఇచ్చిందని తెలిపారు. కోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ కబ్జాదారుడు తమ భూమిలో మద్యం దుకాణం ఏర్పాటు చేశారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

ఆక్రమణల తొలగింపు

తిరుపతి రూరల్: మండలంలోని రామానుజపల్లె వద్ద సర్వే నంబర్ 121/5 బండ పోరంబోకులో చేపట్టిన ఆక్రమణలను సోమవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. రూరల్ తహసీల్దార్ రామాంజనేయులు నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. వీఆర్‌ఓ యోగానంద, సిబ్బంది పాల్గొన్నారు.

పాతకాల్వలో గ్రామ సభ

తిరుపతి రూరల్ : మండలంలోని పాతకాల్వలో సోమవారం రీసర్వే ప్రత్యేక రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. రీ-సర్వే డీటీ మోహన్ అధ్యక్షత వహించిన సభలో భూ సమస్యల పరిష్కారానికి వినతులు స్వీకరించారు. మండల సర్వేయర్ హేమకుమార్, వీఆర్‌ఓ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు బాణసంచా



టపాకాయలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి(అలిపిరి): ఎస్‌జీఎస్ కాలనీలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు సోమవారం జనసేన నేత హరిశంకర్ అందించిన బాణసంచాను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పంపిణీ చేశారు. రమణారెడ్డి, సుబ్బారావు, రమణ పాల్గొన్నారు.

పుష్కరిణి పులకించె!

ఆధ్యాత్మిక క్షేత్రంలో పురాతన పుష్కరిణులు ప్రాచీన సంస్కృతికి ఆనవాళ్లుగా నిలిచాయి. శతాబ్దాల క్రితం ప్రధాన జలవనరులుగా తిరునగరి వాసుల దాహార్తిని తీర్చాయి. కాలక్రమేణా పాలకుల నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. చెత్తాచెదారాలతో నిండిపోయి నిరుపయోగంగా మారిపోయాయి. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పుష్కరిణులు పునరుజ్జీవం పొందాయి. పకడ్బందీగా చేపట్టిన జీర్ణోద్ధరణతో పూర్వ వైభవం సంతరించుకున్నాయి. భూగర్భ జల మట్టం పెంపునకు దోహదపడుతున్నాయి. ఈ క్రమంలోనే తిరుపతి ప్రజలు సేదతీరేందుకు ఆహ్లాదం పంచుతున్నాయి. నిత్యం రాకపోకలు సాగించే వేలాదిమంది యాత్రికులను ఆకట్టుకుంటున్నాయి.



చెన్నారెడ్డి కాలనీలోని కృష్ణమనాయుడిగుంట



కపిలతీర్థం కోనేరు

- పురాతన కోనేరులకు పునరుజ్జీవం
- జల భాండాగారాల జీర్ణోద్ధరణ
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పునరుద్ధరణ



పవిత్ర గోవిందరాజస్వామి పుష్కరిణి



రామచంద్ర పుష్కరిణి పరిసరాల్లో పచ్చదనం

తిరుపతి మంగళం : ఒకప్పుడు ప్రజలు చేదుడు బావి, మెట్ల బావుల నీటిని తాగేవారు. తర్వాత చెరువులు, వాగుల నుంచి నీరు తెచ్చుకుని దాహార్తిని తీర్చుకునేవారు. తర్వాత బోర్లు, కొళాయిలు అందుబాటులోకి వచ్చాయి. అప్పట్లో ఓ దేవాలయం ఉందంటే దానికి చుట్టుపక్కల ఓ కోనేరు నిర్మించేవారు. కాల క్రమంలో వారి నిర్వహణ భారం కావడం, ఆ నీటిని వాడకపోవడంతో అవన్నీ పూడుకుపోయాయి. అలాంటి మెట్ల బావుల విశిష్టతను నేటి తరానికి తెలియజేయాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంకల్పించింది. అందులో భాగంగా నగరంలోని కోనేరులను పునరుద్ధరించింది.

పర్యాటక ప్రాంతాలుగా..

నగరంలోని చెన్నారెడ్డికాలనీలో వందల ఏళ్లనాటి కృష్ణమనాయుడిగుంట, మంచినీళ్ల గుంటతో పాటు రామచంద్ర పుష్కరిణి, గోవిందరాజ స్వామి వారి పుష్కరిణి, కపిలతీర్థం కోనేరును గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆధునీకీకరించింది. చెత్తాచెదారాలతో నిండి నిరుపయోగంగా మారిన కోనేరులను అద్భుతంగా తయారు చేసింది. చుట్టూ పార్కులు ఏర్పాటు చేసింది. లైటింగ్ సౌకర్యం కల్పించి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దింది.

ఆధునిక వైద్యంపై పట్టు అవసరం



మాట్లాడుతున్న స్విమ్స్ డైరెక్టర్ ఆర్‌వీ కుమార్

తిరుపతి తుడా : ఆధునిక విధానంలో వైద్యంపై డాక్టర్లు, విద్యార్థులకు పట్టు అవసరమని స్విమ్స్ వీసీ, డైరెక్టర్ ఆర్‌వీ కుమార్ తెలిపారు. సోమవారం స్విమ్స్ సర్జికల్ అంకాలజీ విభాగం ఆధ్వర్యంలో పద్మావతి ఆడిటోరియం వేదికగా సింహాద్రి సత్యనారాయణరావు 3వ ఎండోమెంట్ చైర్ ఓరేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌వీ కుమార్ మాట్లాడుతూ బ్రెస్ట్ క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ విభాగంలో అందుబాటులోకి వచ్చిన అధునాతన ప్రక్రియలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ నరేంద్ర మాట్లాడుతూ ఎండోమెంట్ ఓరేషన్‌కు సింహాద్రి సత్యనారాయణ రూ.11లక్షలు విరాళంగా ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం ఎంఎస్‌జే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ముక్తా శ్రీనివాసులకు గోల్డ్‌మెడల్ బహూకరించి, సత్కరించారు. కార్యక్రమంలో ఐఎమ్ఎమ్ వైద్యులు డాక్టర్ శ్రీహరిరావు, డాక్టర్ జనార్దన్, మాజీ ఎంపీ డాక్టర్ చింతామోహన్, డీస్ అల్లాడి మోహన్, డాక్టర్ శివకుమార్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ ప్రాణబంధుదాస్, డాక్టర్ టి.జనార్దన్, సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ పాల్గొన్నారు.

కురుబల ఆరాధ్యదైవం కనకదాస



మాట్లాడుతున్న రెడ్డెప్ప

తిరుపతి కల్చరల్ : శ్రీవారి అపర భక్తుడు, కురుబల ఆరాధ్య దైవం భక్త కనకదాస జయంతిని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తరహాలోనే కూటమి సర్కార్ కూడా అధికారికంగా నిర్వహించాలని కురుబ, కురుమ, కురువ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రెడ్డెప్ప కోరారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. అలాగే కనకదాస విగ్రహ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వం తిరుపతి నగరంలో నూతనంగా నిర్మించిన రోడ్డుకు కనకదాసు మార్గంగా నామకరణం చేసిందని వెల్లడించారు. ప్రస్తుత ప్రభుత్వం చొరవతీసుకుని తిరుపతిలో కనకదాస విగ్రహంతో పాటు భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలన్నారు. అలాగే టీటీడీ బోర్డులో కురబలకు స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు శ్రీనివాసులు, మల్లి, నాగసుబ్బయ్య, రెడ్డిశేఖర్, రమేష్, రవీంద్ర, ఆదినారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



గాయపడిన గణేష్

రామచంద్రాపురం: తిరుపతి-పచ్చికాపల్లం మార్గంలో రామచంద్రాపురం వద్ద సోమవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లానికి చెందిన గణేష్ స్వగ్రామానికి వెళుతుండగా ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని 108 వాహనంలో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

తిరుపతి సిటీ : శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో ఇంజినీరింగ్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. సోమవారం ఈ మేరకు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.రాణి మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. వాటిని సాధించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. అందులో భాగంగా ఇంటర్వ్యూ టెక్నిక్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, గ్రూప్ డిస్కషన్స్, టైమ్ మేనేజ్‌మెంట్, ఒత్తిడిని జయించడం వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ బండి రుక్మిణి, ప్రీతి, సుచరిత పాల్గొన్నారు.

పోలీసులపై ఫిర్యాదు

తిరుపతి అర్బన్ : ఎస్వీయూ మైదానంలో ఈ నెల26వ తేదీన నిర్వహించిన లైవ్ షోకు వెళ్లిన ఇద్దరు విద్యార్థులను అమానుషంగా కొట్టిన పోలీసులను సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు జేసీ శుభం బన్సల్‌కు ఫిర్యాదు చేశారు. రవి నాయక్ అనే కానిస్టేబుల్ బూతులు తిట్టడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై హ్యూమన్ రైట్స్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అక్బర్, అశోక్, వినోద్, తేజ, నరేంద్ర, వీరేష్, వినయ్, హరికృష్ణ, ఆశ, తిరుమలేష్, సుందర్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తిరుపతి రూరల్ : మండలంలోని ఓ ప్రైవేట్ లాడ్జిలో అనుమానాస్పదంగా ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. శ్రీపురం కాలనీకి చెందిన వెంకట ప్రసాద్ ఓ ప్రైవేట్ బ్యాంకులో డిప్యూటీ మేనేజర్ పనిచేస్తున్నారు. భార్య మాధురి టీటీడీలో సీసీటీవీ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. ఈ క్రమంలో వెంకటప్రసాద్ సుమారు రూ.40లక్షల వరకు అప్పులు చేశాడు. ఆదివారం ఉదయం 11 గంటలకు లాడ్జిలో రూమ్ తీసుకున్నాడు. మధ్యాహ్నం అతడి భార్య ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. సోమవారం సాయంత్రం లాడ్జిలో ఉరేసుకున్నట్లు సమాచారం అందింది. అయితే బెడ్‌పై రక్తపు మరకలు ఉండడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

అప్రమత్తతతో ఆనంద దీపావళి



తిరుపతి క్రైమ్ : దీపావళి పండుగను ఆనందంగా జరుపుకోవాలంటే తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. ఏమాత్రం అలసత్వం వహించినా ప్రమాదాల బారిన పడాల్సి వస్తుంది. ప్రతి ఇంట్లో సంతోషంగా వెలుగుల పండుగ జరుపుకోవాలి. ఇదే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి.

దీపారాధనకు ప్రాధాన్యం



దీపావళి అంటే దీపారాధనకే ప్రాధాన్యమివ్వాలి. పండుగను పర్యావరణ కోణంలోనే చూడాలి. సాధ్యమైనంత వరకు ఖర్చు తగ్గించుకోవాలి. తక్కువ శబ్దం గల టపాకాయలనే కాల్చాలి. ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. – రేష్మారెడి, గైనకాలజిస్ట్


కళ్లజోడు ధరించాలి



టపాకాయలు కాల్చే సమయంలో తప్పనిసరిగా కళ్లజోడు ధరించాలి. లేకుంటే కళ్లలో నిప్పురవ్వలు పడే ప్రమాదముంది. ఒకవేళ కంట్లో ఏదైనా పడితే ముందుగా చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి. వెంటనే కంటి వైద్యుడిని సంప్రదించాలి.

– రాజా యశ్వంత్, కంటి వైద్యుడు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



పోలీసులు, అగ్నిమాపక, రెవెన్యూ శాఖల సూచనలను వ్యాపారులు కచ్చితంగా పాటించాలి. ఆర్డీఓ ఎంపిక చేసిన ప్రదేశాల్లోనే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలి. వెదురు తడితో కాకుండా ఇనుము, రేకులతో షాపు నిర్మించుకోవాలి. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు.

– సుబ్బరాయుడు, ఎస్పీ

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవీ..

- బాణ సంచా కాల్చేప్పుడు బిగుతుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి.
- బకెట్ నీరు సమీపంలో ఉంచుకోవాలి.
- విషవాయులు పీల్చకుండా మాస్క్ పెట్టుకోవాలి.
- అగ్గిపుల్లలు, కొవ్వొత్తులతో కాకుండా అగరు బత్తులతో టపాకాయలు కాల్చాలి.
- పిల్లలు బాణసంచా పేల్చేప్పుడు పెద్దలు అప్రమత్తంగా పర్యవేక్షించాలి.
- సగం కాలిన వాటిని పట్టుకోకూడదు.
- కంట్లో నిప్పురవ్వలు పడకుండా కళ్ల జోడు ధరించాలి.
- శ్వాస సంబంధిత వ్యాధిగ్రస్తులు దూరంగా ఉండాలి.



భూ పంపిణీకి డిమాండ్

తిరుపతి కల్చరల్ : జిల్లాలోని పేదలకు భూములు పంపిణీ చేసి, వారి అభ్యున్నతికి చర్యలు చేపట్టాలని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జి.భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. తిరుపతి పరిసరాల్లో లక్షలాది ఎకరాల అటవీ, ప్రభుత్వ, సీలింగ్, దేవుడి మాన్యం, మఠం భూములు పెత్తందార్ల కబంధ హస్తాల్లో ఆరోపించారు. ఆయా భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని సూచించారు. దీనిపై కలెక్టర్ వెంటనే స్పందించాలని కోరారు. సమావేశంలో నేతలు చంద్ర, గోపి, ఉమామహేష్, జీవరత్నం, హరి, చరణ్, చెంచురెడ్కిడ, ప్రభాకర్, చంద్రశేఖర్, బాలకృష్ణ పాల్గొన్నారు.

మూట్ కోర్ట్ పోటీలో 'అంబేడ్కర్' విద్యార్థుల ప్రతిభ



అవార్డు అందుకుంటున్న కళాశాల చైర్మన్ తిప్పారెడ్డి, విద్యార్థులు

తిరుపతి సిటీ : ఉత్తర ప్రదేశ్ బరేలీలోని క్లాసిక్ కాలేజ్ ఆఫ్ లా వేదికగా నిర్వహించిన అంతర్జాతీయ మూట్ కోర్టు కాంపిటేషన్‌లో తిరుపతి అంబేడ్కర్ గ్లోబల్ లా కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి బెస్ట్ మెమోరియల్ బహుమతి సాధించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ ఆర్.తిప్పారెడ్డి మాట్లాడుతూ ప్రొఫెసర్ రేష్మి ఆధ్వర్యంలో జ్ఞాని, కౌషిక్, యశ్వంత్‌తో కూడిన లా కాలేజ్ బృందం కాంపిటేషన్‌లో పాల్గొని బహుమతి సాధించడం గర్వకారణమన్నారు. సుదీర్ఘ పరిశోధన, చురుకైన న్యాయవాదనలతో విద్యార్థులు రాణించడం మంత్రముగ్ధులను చేసిందని కొనియాడారు.

సమాచార చట్టంపై అవగాహన

భాకరాపేట : సమాచార హక్కు చట్టం పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఏఓ ధనలక్ష్మి తెలిపారు. సోమవారం చిన్నగొట్టిగల్లు గ్రామ రైతు సేవా కేంద్రంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఆమె మాట్లాడుతూ ప్రజలు అడిగిన సమాచారాన్ని 30 రోజుల్లో అందించాలని స్పష్టం చేశారు. లేకుంటే క్రమశిక్షణ చర్యలు ఉంటాయని చెప్పారు. సమాచార దరఖాస్తును తిరస్కరించినప్పుడు లిఖితపూర్వకంగా కారణం తెలియజేయాలని సూచించారు.

'చెత్త' పనులు చేస్తే జరిమానా



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : నగరంలోని మురుగునీటి కాలువలు, బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా చెత్త వేస్తే జరిమానా విధించాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ఆదేశించారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పన్ను బకాయిలను త్వరితగతిన వసూలు చేయాలన్నారు. ఇంటింటా చెత్త సేకరణను పక్కాగా చేపట్టాలని, నగరంలో ఎక్కడైనా చెత్త కనిపిస్తే ఆయా ప్రాంతాల్లోని అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని ప్రాంతాల్లో ప్రజలకు నిర్ణీత సమయంలో తాగునీరు సరఫరా చేయాలన్నారు. అలాగే డ్రైనేజీల్లో ఎప్పటికప్పుడు మట్టి, చెత్త తొలగించే పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. సీసీ రోడ్ల నిర్మాణం, కాలువల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలో వీధికుక్కలను నియంత్రించాలని వెటర్నరీ అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈలు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్స్ సేతు మాధవ్, రవి, మహాపతి, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, ఉద్యానవన శాఖ అధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు 40 వినతులు

నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 40 వినతులను వచ్చినట్లు కమిషనర్ మౌర్య తెలిపారు. అర్జీలను ఆయా విభాగాల అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మార్‌పల్లె, తహసీల్దార్ కార్యాలయం సమీపంలో సీసీ రోడ్లు, మురుగు నీటి కాలువలు నిర్మించాలని కార్పొరేటర్ ఆరణి సంధ్య కోరారు.

టాస్క్‌ఫోర్స్ సిబ్బంది రక్తదానం



శిబిరంలో పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాస్

తిరుపతి మంగళం : అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా సోమవారం ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్స్ కార్యాలయంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ నేతృత్వంలో 29 మంది సిబ్బంది రక్తదానం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల శరీరంలోకి కొత్త రక్తం చేరుతుందన్నారు.దీంతో ఆరోగ్యంగా జీవనం సాగించవచ్చని సూచించారు. రక్తదానం చేసిన వారిలో డీఎస్పీ జి.బాలిరెడ్డి, ఆర్ఐ కె.సురేష్ కుమార్ రెడ్డి, సీఐ సురేష్ కుమార్, ఆర్ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు. దాతలకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఉద్యోగులు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రుయా బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి డాక్టర్ హరిత పాల్గొన్నారు.

ఆఫీసర్స్ క్లబ్‌కు నూతన కమిటీ



నూతన కమిటీ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : ఆఫీసర్స్ సోషియల్ అండ్ కల్చరల్ క్లబ్ నూతన కమిటీని సోమవారం ఎంపిక చేశారు. ఎన్నికల అధికారి ప్రొఫెసర్ జి.రామచంద్రయ్య ఆధ్వర్యంలో చేపట్టిన సర్వసభ్య సమావేశంలో ప్రక్రియ చేపట్టారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.మోహన ముని సిద్దారెడ్డి, కార్యదర్శిగా డాక్టర్ ఎన్.ఆదికృష్ణయ్య, ఉపాధ్యక్షులుగా పి.భాస్కరుడు, వి.రవి, సహాయ కార్యదర్శిగా బొందు రామ చంద్రారెడ్డి(సాంస్కృతికం), జీవీ మునికృష్ణయ్య(క్రీడలు), ఇంటర్నల్ ఆడిటర్ వి.కరంచంద్, కోశాధికారిగా ఎస్‌వీఎస్.ప్రసాద్‌రెడ్డి నియమితులయ్యారు. వీరితో పాటు సభ్యులుగా ఎస్.బాబురావు, ఆర్‌వీ. దుర్గాప్రసాద్, జె.లక్ష్మీనారాయణ, వి.రమేస్‌బాబు, కేఆర్. సుభాష్, సీఎస్.సుకుమార్ రెడ్డి ఎంపికయ్యారు.

హామీల అమలుకు డిమాండ్



ధర్నా చేస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నేతలు

తిరుపతి కల్చరల్ : ఆటో కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు ఆర్టీసీ బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ అధికారం చేపట్టి వంద రోజులుపైగా గడుస్తున్నా హామీలు అమలు చేయడం లేదని మండిపడ్డారు. ఆటో కార్మికులపై పెనుభారం మోపే జీఓ 21,31ను రద్దు చేయాలని కోరారు. హమాలీల సంక్షేమం చట్టం తీసుకురావాలని స్పష్టం చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ముట్టడికి పిలుపు ఇస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నేతలు కేవై.రాజా, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీరాములు, ఉదయ్‌కుమార్, సురేష్, వెంకటేష్, శ్రీనివాసులు, నరసింహులు, బాల, ప్రమీల, సతీష్, రామచంద్రయ్య, పార్వతి, ఎల్‌కే నాయుడు, నాగరాజు, యువరాజ్, మురళి, రజని, అల్లాబ్ పాల్గొన్నారు.